
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

బుధవారం 20 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ | 6:33

బుధవారం

సహర్ | 4:58


గురువారం

బీమా చెక్కు అందజేత

కొడిమ్యాల, మార్చి 19 : మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన సౌగాని నాగయ్య ప్రధానమంత్రి జీవన జ్యోతి ఇన్సూరెన్స్ 436 రూపాయలతో స్కీం చెల్లించాడు. నామినిగా అతని భార్య మంజుల పేరును నమోదు చేశాడు. ఇటీవల ఆయన మృతి చెందగా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ. 2లక్షల చెక్‌ను మంగళవారం మృతుడి భార్య మంజులకు యూనియన్ బ్యాంక్ కొడిమ్యాల బ్రాంచ్ మేనేజర్ సంజీవ్‌కుమార్ అందించారు.

'హస్తం' టికెట్ ఎవరికో..?

- బీజేపీ, బీఆర్ఎస్‌లతో ఢీ కొట్టేదెవరు..
- తేలాల్సింది కాంగ్రెస్ అభ్యర్థే
- జగిత్యాల జిల్లాలో చర్చనీయాంశంగా మారిన కాంగ్రెస్ వ్యవహారం



జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎవరో తేలి పోయినా కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఇంకా ఖరారు కావడం లేదు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలై బీజేపీ ప్రచారంపై దృష్టి కేంద్రీకరించి సాక్షాత్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో జగిత్యాలలో విజయ సంకల్ప సభ యాత్ర సక్సెస్ చేసుకున్నప్పటికీ కాంగ్రెస్ ఇప్పటికీ అభ్యర్థిని ప్రకటించకపోవడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ప్రకటించినప్పటికీ ఆ పార్టీ ఇంకా ప్రచారాన్ని ఉధృతం చేయడం లేదు. కాంగ్రెస్ నుంచి అభ్యర్థి ఎవరన్నదే ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ, ఎంపీగా పోటీ చేసే అవకాశం ఎవరికి ఇస్తుందనేది ఆసక్తిగా మారింది. నిజానికి లోక్ సభ అభ్యర్థిత్వాలపై కసరత్తు కాంగ్రెస్‌లోనే మొదట మొదలైంది. డీసీసీ, పీసీసీల నుంచి నివేదికలు తీసుకున్న కేంద్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ దాదాపుగా రెండు నెలలుగా కసరత్తు చేస్తోంది. ఇటీవల జాబితా విడుదల చేసినప్పటికీ అందులో నిజామాబాద్‌కు చోటు లభించలేదు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన హస్తం పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటడం ప్రతిష్ఠాత్మకంగా మారింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ స్థానాలుండగా కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాలనే గెలుచుకుంది. ఇతర జిల్లాలతో పోలిస్తే నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో వచ్చిన ఫలితాలు కాంగ్రెస్‌ను కాస్త నిరాశ పరిచాయని రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు బీఆర్ఎస్, రెండు బీజేపీ, రెండు కాంగ్రెస్ గెలుచుకోవడంతో ఇక్కడ మూడు పార్టీలు బలంగానే ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ తరుణంలో సీటును గెలుచుకునే లక్ష్యం నెర వేరాలంటే వ్యూహాత్మకంగా వెళ్లాల్సిన పరిస్థితి చోటుచేసుకుంది. ఇందులో అభ్యర్థి ఎంపికే కీలకమని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ప్రత్యర్థి పార్టీలను ధీటుగా ఎదుర్కొనే వారికి అవకాశం ఇవ్వాలనే ఆలోచన కాంగ్రెస్ చేస్తోంది. ఇందుకు అనుకూలించే సమీకరణాలను పరిగణలోకి తీసుకునే అంశాలపై ప్రదేశ్ ఎన్నికల కమిటీ స్థాయిలో ఇప్పటికే చర్చలు జరిగాయి. కమిటీలోని సభ్యులు తమ అభిప్రాయాన్ని కేంద్ర ఎన్నికల కమిటీకి నివేదించారు.

పోటా పోటీగా ప్రయత్నాలు..

నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్‌ను చేజిక్కించుకోవడానికి పోటా పోటీగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిష్టానం వద్ద పలువురు నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో ఆది నుంచి పేరు వినిపిస్తున్న ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ఒకరైతే... మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఇంకొక పేరు ప్రధానంగా చర్చల్లోకి వస్తున్నాయి. వీరికి తోడు ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత సునిల్‌రెడ్డి, ఓ సినీ నిర్మాత పేర్లు వినిపిస్తున్నాయి. జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని పలు సెగ్మెంట్‌లకు చెందిన నేతలు తొలుత జీవన్‌రెడ్డి వైపు మొగ్గు చూపారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీ సామాజిక వర్గానికి సీట్లు కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వడంతో మళ్లీ ఈ అంశంపై చర్చ మొదలైంది. బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లకు ఆయా పార్టీల అధిష్టానం అవకాశాలు కల్పించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసే అవకాశం దక్కని ఈరవత్రి అనిల్ పార్లమెంట్ టికెట్‌ను ఇవ్వాలని అధిష్టానం వద్ద ప్రయ త్నాలు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. జగిత్యాల నుంచి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని సైతం అధిష్టానం పరిశీలనలోకి తీసుకుంది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు వినిపిస్తున్నప్పటికీ కాంగ్రెస్ అధిష్టానం ఎటువైపు మొగ్గుచూపుతుందో...ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తుందోనని కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

తెరపైకి బీసీ నినాదం..

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ బీసీలకు టికెట్ కేటాయించడంతో కాంగ్రెస్‌లోనూ బీసీ నినాదం తెరపైకి వస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు టికెట్ కేటాయించడంపై పార్టీ పరిశీలన చేస్తున్నట్లు వినిపిస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఇతర నియోజకవర్గాల్లోనూ బీసీల్లో ప్రధానంగా పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉండడంతో సంబంధిత కోణంలో పరిశీలన జరుగుతుందన్న చర్చలు చోటుచేసుకుంటున్నాయి.

జీవన్ రెడ్డి రూటు ఎటువైపు...?

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రూటు ఎటువైపు సాగుతుందోనని ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చలు చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన జీవన్ రెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి దింపాలని అధిష్టానం ఆలోచిస్తుందని అంటున్నారు. నిజామాబాద్ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలా...కరీంనగర్ నుంచి దింపాలా అన్నది తేలాల్సి ఉన్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన వారికి సాధ్యమైనంత మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశాలు ఇవ్వవద్దని పార్టీ భావిస్తోందన్న మరో వాదన సైతం వినిపిస్తోంది. అయితే సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగియున్న జీవన్‌రెడ్డి సేవలు పార్టీ ఏ విధంగా వినియోగించుకుంటుందోనని ఆయన అనుచరులు ఎదురు చూస్తున్నారు.

ఇప్పటికే రెండు పర్యాయాలు జీవన్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారు. 2006లో కరీంనగర్ లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2008లో మరోమారు కాంగ్రెస్ నుంచి కరీంనగర్ ఎంపీగా పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ చేతిలో ఓడిపో యారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సమయంలో నిజామాబాద్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి పేరు విస్తృతంగా వినిపిస్తోంది. ఇదిలాఉండగా జీవన్‌రెడ్డి పదకొండు పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఆరు మార్లు ఎమ్మె ల్యేగా గెలుపొంది తెలంగాణలో తనదైన ముద్ర వేసుకున్నాడు. 2023 డి సెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మాకు నూరి సంజయ్ కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ దక్కించుకొని తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

కక్ష పూరితంగానే అక్రమ కేసులు, అరెస్టులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్దోషి అని..కావాలని కక్ష పూరితంగానే అక్రమ కేసులు, అరెస్టులు చేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వ కుంట్ల సంజయ్‌లతో కలిసి మాట్లాడారు. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ఈడీని వాడుతున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టడం మోదీకి కొమ్ము కాయడం ఈడీ పనిగా పెట్టుకుందన్నారు. కేసీఆర్ తెలంగాణ దాటి వస్తే బీజేపీకి మనుగడ ఉండదని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకుల స్క్రిప్ట్ ప్రకారమే ఈడీ యాక్షన్ చేస్తుందని విమర్శించారు. బీజేపీ అల్లిన ఒక కల్పిత కథ లిక్కర్ స్కామ్ అని విమర్శించారు. చోటా బాయ్, భడే బాయ్ ఇద్దరూ పార్టీ సిద్దాంతాలు కాదని కలిసిపోయారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రజల్లో బలంగా ఉందని, బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కడిగిన ముత్యంలా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బయటకు వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అరెస్టు అనేది ఎన్నికల స్టంట్‌గా స్పష్టమవుతోందన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాను చాటుతామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, నాయకులు రాజేశ్, దేవయ్య, రాంమోహన్, మహేశ్, పోచాలు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సజావుగా ఎన్నికలను నిర్వహించడానికి అన్ని రాజకీయ పక్షాలు, ఇతర వర్గాలు సహకరించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌లు అన్నారు. మంగళ వారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువ డడంతో జిల్లా వ్యాప్తంగా కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలు ప్రచార నిర్వహణలో భాగంగా ప్రచార వాహన, మైకు, ఇతరత్రా అనుమ తులు తీసుకోవాలన్నారు.

సువిధ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రి అనుమతులకు మీడియా సర్టిఫి కేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, నిరంత రంగా పని చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అత్యవ సర, ఇతర సేవలకు 18004257620 కంట్రోలు రూం నంబరుకు సంప్రదించాలని, 1959 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మాడల్ కోడ్ అమలుకు 18 ఫ్లయింగ్ స్క్వాడ్, 18 స్టాటిస్టిక్ సర్వే లైన్స్ టీములు, 18 మోడల్ కోడ్ అధి కారులు, 6 వీడియో వీవింగ్ టీమ్‌లు, 91 సెక్టోరల్ అధికారులను నియమించామని, 7 అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలి పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, ఆర్‌డీఓలు మధుసూదన్, ఆనంద్ కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోకమాత ఆశీస్సులు ఉండాలి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



లక్ష్మణ్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లోకమాత పోచమ్మ తల్లి ఆశీస్సులతోనే ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, సుభిక్షంగా ఉండడం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని లోకమాత పోచమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయానికి వచ్చి లక్ష్మణ్ కుమార్‌కు పూర్ణకుంభముతో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో పలు ప్రత్యేక పూజలను ఆయన నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గాజుల రాజేందర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిరి నాగభూషణం, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడాలి

కొడిమ్యాల, మార్చి 19 : మండలంలోని పూడూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం హన్మాన్ భక్తులు హన్మాన్ చాలీసా చదువుతూ నిరసన తెలుపుతుండగా అదే గ్రామంలో జరిగిన ఎల్లమ్మ సిద్దోగంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. తిరుగు ప్రయాణంలో ఒక హోటల్ వద్ద టీ తాగటానికి నిలిచారు. ఏం జరుగుతుందని వాకబు చేయగా బెంగుళూర్‌లో జరిగిన సంఘటన గురించి వివరించారు. హన్మాన్ చాలీసా పఠనం చేస్తున్న వ్యక్తిపై జరిగిన దాడికి చింతిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కర్ణాటక ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీ వెంట మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, ఎంపీపీ స్వర్ణలత, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

రోజురోజుకూ కాంగ్రెస్ మరింత బలోపేతం

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో నియోజకవర్గంలోని సారంగపూర్ మండలానికి చెందిన పలువురు యువకులు, నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరడానికి వచ్చిన యువకులకు, నాయకులకు కండువాలను కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాంచంద్రరెడ్డి, సరళ, విమల సుధాకర్, రవి, ప్రసాద్, తిరుపతి, లవన్, నరేశ్ పాల్గొన్నారు.

- జగిత్యాల పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికయిన పెండం మహేందర్, ఇతర కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందించారు.
- రాష్ట్ర గంగపుత్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌గా ఇటీవల నియామకమైన మెట్టు సాయి, జిల్లా కాంగ్రెస్ ఫిషర్ సెల్ అధ్యక్షుడు తోపారపు రజనీ కాంత్‌లు మంగళవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేగా ఓడినా ప్రజల మధ్యే ఉంటా

జగిత్యాలరూరల్ : తాను ఎమ్మెల్యేగా ఓడినా బాధలేదని, ప్రజల మధ్యే ఉంటానని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం సంతోషాన్ని ఇచ్చిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల మండలంలోని పెరుకపల్లిలో గల బీఎల్ఎన్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమం మంగళవారం కొనసాగింది. జగిత్యాల రూరల్ మండల ఎంపీపీ మంగళారపు మహేష్, తిప్పన్నపేట తాజామాజీసర్పంచ్ జయరాజలింగు, హస్నాబాద్ ఎంపీటీసీ దమ్మ మల్లారెడ్డిలతో పాటు 300 మంది బీఆర్ఎస్‌పార్టీనుండి కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం వైఎస్సార్ నియోజకవర్గం పులివెందులతో పోటీపడి పనిచేశానని, నేడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొడంగల్‌తో పోటీపడేలా జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి, జిల్లా మహిళకాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, కాం గ్రెస్‌పార్టీ రూరల్ మండలశాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్, ప్యాక్స్ వైస్‌ఛైర్మన్ శీలం సురేందర్, మాజీ ఎంపీపీ రమేష్‌బాబు, జగిత్యాల కాంగ్రెస్‌పార్టీ నియోజ కవర్గ యువజన శాఖ ప్రధాన కార్యదర్శి నాగార్జునా, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు దేవాదాయ కమిషనర్‌కు ఆహ్వానం

ధర్మపురి, మార్చి 19: ధర్మపురిలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల కోసం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావును మంగళవారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఉన్న కమిషనర్‌ను వేదపండితులు, అర్చకులు వెంట రాగా మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆయనను స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కొడిమ్యాల, మార్చి 19 : వలంటీర్లు క్రమ శిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ అన్నారు. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవాపథకం ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా నాలుగవ రోజు మంగళవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్సై మాట్లాడుతూ శిబిరాలలో పాల్గొంటే క్రమశిక్షణ, సోదర బావం పెరగటంతో పాటుగా సమయపాలన అలవడుతుందన్నారు. సామాజిక సమస్యల పట్ల అవగాహన కలుగుతుందన్నారు. వాలంటీర్లు ఎంచుకున్న రంగంలో క్రమశిక్షణతో ముందుకు వెళితే విజయం సాధ్యమవుతుందన్నారు.

అంతక ముందు వలంటీర్లు జూనియర్ కళాశాల మైదానాన్ని శుభ్రం చేశారు, కళాశాలలోని మరుగుదొడ్ల వైపు నూతనంగా రోడ్డును మట్టి పోసి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధి కారులు ఆర్. గోపికృష్ణ, కె. సతీష్, మాజీ ఉప సర్పంచు గడ్డం జీవన్‌రెడ్డి, సీనియర్ వాలంటీర్ ఎం. రవిచందర్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఐపీఎస్ అధికారి



ఎస్పీకి పూలమొక్క అందిస్తున్న ఐపీఎస్ అధికారి

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌ను మంగళవారం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయను కొద్ది కాలం పాటు విధులు నిర్వహించడానికి జగిత్యాలకు అలాట్ చేస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను కలిసి పుష్పగుచ్చం అందించారు. పలువురు పోలీసు సిబ్బంది ఆయనను అభినందించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శిగా నాగార్జున్

జగిత్యాలరూరల్, మార్చి 19 : జగిత్యాల కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ యువజన శాఖ ప్రధానకార్యదర్శిగా జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొడిపెల్లి నాగార్జున్‌ను నియమిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీపటిష్టతకు కృషి చేయాలని జీవన్‌రెడ్డి సూచించారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి, సహకరించిన కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులకు, గ్రామకాంగ్రెస్ నాయకులకు పార్టీపెద్దలకు, కార్యకర్తలకు నాగార్జున్ కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ యువజనశాఖను నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యేల అనర్హతపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



చింతకుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 19 : ఎమ్మెల్యేల అనర్హత విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలుపుకున్న సమయంలో గుర్తుకు రాలేదా అని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని చింతకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్లలో విచ్చలవిడిగా ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టినప్పుడు గుర్తుకు రాలేదా అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని అప్పటి స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారికి ఎందుకు ఒత్తిడి తీసుకు రాలేదన్నారు. రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. కేటీఆర్, హరీష్‌రావు మాదిరిగా ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి పార్టీలో చేరుమని కాంగ్రెస్ పార్టీ బలవంత పెట్టడం లేదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో కనుమరుగైన విషయం ఆ పార్టీ శ్రేణులకు తెలిసిందని ఎంపీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనిపించదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేయడానికి ప్రతిమ మల్టీప్లెక్స్‌లో దాచి పెట్టారని ఆ డబ్బుతో తమకు సంబంధం లేదంటున్న వినోద్‌రావు వేములవాడ రాజన్న ముందు ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, చెదలు సత్యనారాయణ, గాజ ప్రభాకర్, మల్లేశం ఉన్నారు.

ఎల్లమ్మ సిద్దోగంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మండలంలోని భూషణరావుపేటలో ఎల్లమ్మ సిద్దోగం కార్యక్రమంలో మంగళవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. మూడు రోజులుగా ఎల్లమ్మ పట్నాలు కార్యక్రమాలు కొనసాగుతుండగా చివరి రోజు ఎల్లమ్మ బోనాలు, సత్యమాజమదగ్ని, మహర్షి కళ్యాణ మహోత్సవం, సిద్దోగం వంటి కార్యక్రమాలు జరిగాయి. ముగింపు ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గీతకార్మిక సంఘ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. పోతురాజులు ప్రదర్శించిన ఎల్లమ్మ నాటకం అలరించింది. గీతకార్మికులు డప్పు చప్పుళ్ళ మధ్య సుమారు పది మంది తాటిచెట్లు ఎక్కి కల్లు తీసుకువచ్చే కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గడ్డం స్వామిరెడ్డి, సులోచన, వాకిటి రాజరెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, తిరుపతిరెడ్డి, మోహన్, అశోక్ పాల్గొన్నారు.





మహిళా కండక్టర్‌పై దాడి.. పోలీసులకు అప్పగింత

కోరుట్ల, మార్చి 19: మద్యం మత్తులో ఆర్టీసీ బస్సులోని మహిళా కండక్టర్‌పై ఓ ప్రయాణికుడు దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం కోరుట్లలో జరిగింది. వేములవాడ డిపోకు చెందిన బస్సు కోరుట్ల బస్‌స్టాండ్ నుంచి వేములవాడకు వెలుతుంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రయాణికుల తో పాటు బస్సు ఎక్కాడు. పట్టణంలోని నంది చౌరస్తా ప్రాంతానికి చెరుకోగా మద్యం తాగి ఉన్న వ్యక్తి బస్సు కండక్టర్ టికెట్ విషయంపై ప్రశ్నించగా సదరు వ్యక్తి కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించాడు. దీంతో డ్రైవర్ అప్రమత్తమై పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి బస్సును తీసుక పోయి అతనిని పోలీసులకు అప్పగించారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 19: మహిళపై దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దీటి తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని దీటి లక్ష్మికి ఆమె బావ శ్రీనివాస్‌తో కొంతకాలంగా ఇంటి పంపకం విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో శ్రీనివాస్ కొడుకు తిరుపతి ఈ నెల 18న రాత్రి లక్ష్మి ఇంటికి చేరుకొని గొడవకు దిగాడని చెప్పారు. అంతటితో ఆగని అతడు లక్ష్మిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఇంటి సమీపంలో ఉన్న పశుగ్రాసాన్ని దహనం చేశాడని తెలిపారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

జనశక్తి నక్సలైట్ పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కోనరావుపేట, మార్చి 19: జనశక్తి నక్సలైట్ పేరుతో ప్రజలను భయపెడుతూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం కొదురు పాక గ్రామానికి చెందిన చెన్నమనేని పురుషోత్తమరావు ప్రభుత్వ నిషేధిత విప్లవ సంస్థ జనశక్తి అరుణోదయ సంస్థలోపనిచేస్తున్నానని అమాయక ప్రజలను బెదిరిస్తూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడని పురుషోత్తమరావును కోనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కుతరలించినట్లు తెలిపారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టే వారి సమాచారం పోలీసులకు అందించాలని అన్నారు.

వడదెబ్బ తగలకుండా ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వెల్గటూర్, మార్చి 19: వేసవికాలంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం వెల్గటూర్, కోటిలింగాల గ్రామాలలో ఉపాధాహామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముందు జాగ్రత్తగా ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణం ప్రాముఖ్యతను వివరించి పాకెట్లు అందజేసినట్లు తెలిపారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. శరీరంపై ఏర్పడే స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.













ప్రమాదవశాత్తు గోడకూలి బాలుడి మృతి

మేడిపల్లి, మార్చి 19: సిమెంట్ గోడకూలి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మేడిపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి శివారులో నిర్మిస్తున్న పౌల్ట్రీఫాంలో మహబూబాబాద్ జిల్లా వొడ్డెర గూడెం గ్రామానికి చెందిన సంపంగి సంగీత, శ్రీను దంపతులు తమ కొడుకు గణేష్(4)ను తీసుకొని కూలీపనులు చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో అదే ఫాంలో పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన అమరగోని రాజు కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో సిమెంట్ గోడ పక్కనే నిద్రిస్తున్న బాలుడిపై గోడ కూలడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పొట్టకూటి కోసం వచ్చి తమ కుమారుడిని కోల్పోవడంతో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. తల్లి సంపంగి సంగీత ఫిర్యాదు మేరకు డ్రైవర్ అమరగోని రాజుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోపాల్‌రావుపేటలో బైక్ చోరీ

రామడుగు, మార్చి 19: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఇనుగుర్తి రఘువీర్ అనే వ్యక్తి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇంటి ముందు పెట్టిన యమహా బైక్‌ను దొంగిలించడంతో బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గత 15 రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనకు గురి అవుతున్నారు. బస్టాండ్ వద్ద రాత్రి వేళల్లో షాపుల తాళాలు పగులకొట్టి నగదు, పరికరాలను ఎత్తుకెల్లిన సంఘటనలున్నాయి. సీసీ కెమరాలను ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొడిమ్యాల, మార్చి 19: మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన గుడి మల్లారెడ్డి(65)కరీంనగర్ ఆసుపత్రిలో 10 రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. వయస్సు పైబడి, కుటుంబ పోషణ భారమై ఈ నెల 8న జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద మల్లారెడ్డి పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లారెడ్డి భార్య గుడి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

27నుంచి వేములవాడలో శివకల్యాణోత్సవాలు

వేములవాడ, మార్చి 19: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో ఈ నెల 28వ తేదీన శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు శ్రీ శివకల్యాణోత్సవాలు జరుపనున్నారు. ఇందులో భాగంగా 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05 ని.ల నుంచి శ్రీస్వామివారి రథోత్సవము నిర్వహిస్తారు.


శ్రీరాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం

ఐదు రోజులపాటు ఆర్జిత సేవల నిలిపివేత

శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీ స్వామివారి నిత్యకల్యాణం, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకల్యాణోత్సవము సందర్భంగా 28వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు కోడె టికెట్లు జారీ నిలిపివేస్తామని, నిత్య చండి సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వబడవని వెల్లడించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానములో ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజులపాటు డోలోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 23వ తేదీ శనివారం సాయంత్రం ప్రదోష పూజ అనంతరం కామ దహనం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, మార్చి 19: సైదాపూర్ మండలంలో పెర్కపల్లి గ్రామానికి చెందిన పోతరాజు ఓదయ్య(85) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓదయ్య భార్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి ఓదయ్య మతి స్థిమితం ఉండడం లేదు. భార్య చనిపోయిందని ప్రతి రోజు భార్యను తలుచుకుంటూ ఆవేదన చెందేవాడు. మనస్థాపంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి ఓదయ్యను 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఓదయ్య అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి కుమారుడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం,మార్చి 19: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై దావత్ చేసుకుందామని పిలిచి దాడిచేసి అందినకాడికి దోచుకున్న వేములవాడ మండలంలోని చింతల్‌ఠాణాకు చెందిన సూరదేవయ్య, సూర సురేష్‌లను మంగళవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ముక్క శ్రీనివాస్‌కు చింతల్‌ఠాణకు చెందిన సూర దేవయ్యలకు ఫేస్‌బుక్ ద్వారా 15 రోజుల క్రితం పరిచయం ఏర్పడిందన్నారు. ఈ పరిచయమే దావత్ చేసుకోవాలని నిర్ణయించుకోవడంతో బొల్లారం నుంచి చింతల్‌ఠాణకు శ్రీనివాస్ వచ్చాడన్నారు. ఈనెల 17న బాబయ్ దేవయ్య, అబ్బాయ్ సురేష్‌లు ముందుగానే మద్యం సేవించి సిరిసిల్ల పాత బస్టాండ్‌లో తాను బస్సు దిగగానే బైపాస్‌రోడ్డు వద్దకు తీసుకెళ్లి తనపై దాడిచేసి రూ.3 వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నారని బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదుచేసి చంద్రంపేట ఎక్స్ రోడ్డు వద్ద అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు.

అంజన్న టెండర్ సొమ్ముల స్వాహాపై విచారణ

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో టెండర్‌దారులు చెల్లించిన సొమ్ములను ఆలయ అధికారి దేవస్థానం ఖాతాలో జమచేయకుండా స్వాహా చేయడంపై పత్రికల్లో వచ్చిన కథనాలతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కే.జ్యోతి మంగళవారం విచారణ జరిపారు. టెండర్ల విభాగం అధికారి శ్రీనివాసాచారి దాదాపు రూ.37లక్షల మేర సొమ్ములను దుకాణదారుల వద్ద వసూలు చేసి దేవస్థానం పద్దుకు చేర్చకపోవడంతో కొన్నాళ్ల క్రితం ఈ విషయం తీవ్ర దుమారం లేపింది. దీంతో అతన్ని దేవస్థానం అధికారులు సస్పెండ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేశారు. ఇటీవల మరో రూ.11లక్షల వరకు కూడా తేలగా సదరు అధికారి గత 2020 నుంచి 2023 వరకు నిర్వహించిన టెండర్ విభాగంలో జరిగిన ఈ స్వాహా పర్వంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. 2022-23 సంవత్సరంలోనే అధికంగా దాదాపుగా రూ.50లక్షల మేర సొంతానికి వాడుకున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అనంతరం క్యాష్‌బుక్ తదితరవి ఏడీసీ స్వాధీనం చేసుకొని తీసుకెళ్లారు. టెండర్ల లావాదేవీలకు సంబంధించిన బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ తీసుకు రావాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. 2018-19లో ఆడిట్ అధికారులు అనేక అభ్యంతరాలతో కూడిన నివేదిక ఇవ్వగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీసీబీ, సీబీ, ఆడిట్ నివేదికలను కూడా ఏడీసీ తీసుకెళ్లగా విచారణ నివేదికను కమిషనర్‌కు అందించనున్నట్లు ఏడీసీ ఈ సందర్భంగా తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు రుజువు అయితే అందరిపై చర్యలు తప్పవన్నారు. ఈ విచారణలో కరీంనగర్ ఏసీ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్, ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు శ్రీని వాస్‌శర్మ, సునీల్ ఉన్నారు. ఈ విచారణలో మరింత అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని, అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల వారి పాత్రపైనా విచారణ జరిపించాలని డిమాండ్ వినిపిస్తోంది.


పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ జ్యోతి

నెమలిని వేటాడిన వ్యక్తి అరెస్టు

- ప్రధాన నిందితుడు సత్యనారాయణ ఓ డీఎస్పీ తండ్రి
- గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు

పెగడపల్లి, మార్చి 19 : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామ శివారులో సోమవారం రాత్రి నెమలిని వేటాడి చంపిన ఘటనలో వేటగాళ్లను జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీసులు సోమవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేశారు. నెమలి వేటగాళ్లలో ప్రధాన నిందితుడు ములుగు జిల్లాలోని ఓ డీఎస్పీకి తండ్రి కావడం గమనార్హం. ఇతడు గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మంగళవారం పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ రఘుచందర్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ (63), జగిత్యాల మండలం మల్యాలకు చెందిన జవ్వాజి రాజు కారు డ్రైవర్‌తో కలసి సోమవారం సాయంత్రం పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో తుపాకీతో నెమలిని వేటాడి చంపారు. దానిని కారులో తీసుకుని వెళ్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు పెగడపల్లి ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి కారును ఆపి తనిఖీ చేశారు. కారులో నెమలి కళేబరంతో పాటు లైసెన్సు లేని తుపాకీ, గొడ్డలి ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నెమలిని వేటాడి తానే చంపినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు. నిందితుడి వద్ద నుంచి 0.22 స్పోర్టింగ్ రైఫిల్ అని రాసి ఉన్న తుపాకీతో పాటు 34 నిండు తూటాలు, ఒక కాల్చిన తూటా, గొడ్డలి, ఏపీ 15 బి 8093 నంబరు గల కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణతోపాటు డ్రైవర్ జవ్వాజి రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడు సత్యనారాయణ 2017 లో భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతంలో జింకల వేట కేసు లోనూ ప్రధాన నిందితుడని ఇతడికి వన్యప్రాణుల వేట అంటే మక్కువ అని తెలుస్తోందని డీఎస్పీ తెలిపారు.


పెగడపల్లిలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, మార్చి 19 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంకు చెందిన ఆల్లేశ్వరం శంకర్ (45) అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ కర్నాటక రాష్ట్రంలోని బెంగళూర్ పట్టణంలో వడ్రంగిగా పనిచేస్తూ జీవించేవాడని అక్కడ ఉన్నపుడు అతనికి గుండె సమస్యతో ఆసుపత్రిలో చేరగా వైద్యులు శంకర్‌కు గుండె శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం కోరుట్లకు వచ్చిన శంకర్ పట్టణంలో వడ్రంగి పని చేస్తుండేవాడని తెలిపారు. శంకర్ అవసరాల నిమిత్తం ప్రైవేట్ బ్యాంక్‌లతో పాటు బంధువుల వద్ద అప్పుచేసినట్లు వివరించారు. అప్పులు ఎలా చెల్లించాలని భార్యతో పాటు కుటుంబ సభ్యులకు చెప్పుకుంటూ నిరంతరం బాధపడేవాడని తెలిపారు. గత వారం రోజుల క్రితం బ్యాంక్‌కు చెందిన వారు రుణం చెల్లించాలని ఫోన్ చేయగా అప్పటి నుంచి బాధపడుతూ మంగళవారం వేకువజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాలుపడినట్లు ఎస్ఐ తెలిపారు. శంకర్ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి తీర్పు

వెల్గటూర్, మార్చి 19: మండలంలోని ముత్తునూర్ గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య అనే ఇద్దరు వ్యక్తులకు 2009లో జరిగిన భైరం దామోదర్ హత్య కేసులో జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ముత్తునూర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు భైరం దామోదర్, సింగం రాజయ్య అదే గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, సింగం రాజయ్యలకు పొలం వద్ద నీరు విషయంలో గొడవ జరిగింది. పాత కక్షలను మనసులో పెట్టుకొన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య సహాయంతో 2009 డిసెంబరు 24న సింగం రాజయ్యను చంపాలని అతని పొలం వద్ద మాటు వేశారు. సింగం రాజయ్య పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో అక్కడే ఉన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలు కత్తులతో హత్య చేయాలని వెంబడించగా రాజయ్య గ్రామం వైపు పరుగెత్తాడు. అదే సమయంలో పొలం పనులు ముగించుకొని వెళుతున్న సింగం రాజయ్య స్నేహితుడు భైరం దామోదర్‌ను సీపతి ప్రభాకర్, నేరెల్ల రాజయ్యలు కత్తులతో మెడ, పొట్ట భాగంలో పొడవడంతో భైరం దామోదర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దామోదర్ సోదరుడు లచ్చయ్య ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలను కోర్టులో హాజరు పరిచారు. కేసును విచారించిన అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు, రూ.5 వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో అడిషనల్ పీపీ మల్లేశం, ఇన్వెస్టిగేషన్ అధికారులు దామెర నర్సయ్య, సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ ఎం. కిరణ్ కుమార్ నిందితులకు శిక్ష పడడంలో కోర్టుకు సా క్ష్యాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి19: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం(సీఓఈ)లో 2024-25 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జి.దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఓఈలో బాలురకు(80), బాలికలకు(80) సీట్లు ఉన్నట్లు తెలిపారు. ప్రవేశము పొందిన విద్యార్థులకు 9వ తరగతి సిలబస్‌తో పాటు ఐఐటి ఫౌండేషన్ కోర్సు, నీట్ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ ఉచితంగా అన్ని సౌకర్య ములు కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యా ర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, అసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కొరకు ఫోన్.7337349518కు సంబంధిన వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయం ముందు భక్తులు

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు అంజన్నతో పాటు శ్రీరాముల వారిని బేతాళుడిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అయితే ఎండల తీవ్రత నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న చలువపందిళ్ల పనులు నత్తనడకన సాగుతుండడంతో భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు.

ఇంటి వద్ద తండ్రి మృతదేహం

- బాధను దిగమింగుకుని పరీక్ష రాసిన అన్నదమ్ములు

పెగడపల్లి, మార్చి 19: విధి పరీక్ష పెట్టినా ధైర్యంగా ఎదుర్కొన్నారు.. ఆ అన్నదమ్ములు. నాన్న చనిపోయాడని తెలిసి అంత్యక్రియలు నిర్వహించాల్సిన సమయం అయినా పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని పదోతరగతి పరీక్ష రాశారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని బతికెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన గాజె రాము, లక్ష్మణ్ కవల పిల్లలు. వీరు పదో తరగతి చదువుతున్నారు. రాము, లక్ష్మణ్ తండ్రి చంద్రయ్య(50) ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆ అన్నదమ్ములు బాధను దిగమింగి మంగళవారం జరిగిన పరీక్షకు హాజరయ్యారు. అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు.


పరీక్ష రాసి బయటకు వస్తున్న రాము, లక్ష్మణ్

మాజీ భర్తపై భార్య యాసిడ్ దాడి

ఇబ్రహీంపట్నం, మార్చి 19: మాజీ భర్తపై ఓ మహిళ యాసిడ్ దాడి చేసిన ఘటన మండలంలోని ఎర్దండి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్దండి గ్రామానికి చెందిన నీరటి మహేష్ మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. కొంత కాలంగా దంపతులకు మనస్పర్థలు రావడంతో 2023లో మహేష్, లక్షణ కోర్టు నుంచి విడాకులు తీసుకున్నారు. మహేష్ మరో యువతిని పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుని ఈ నెల 20న పెళ్లికి సిద్ధం అయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ భార్య లక్షణ మహేష్‌పై కక్ష పెట్టుకుని మంగళవారం మహేష్ ఇంటికి వెళ్లి అతను ఇంటి నుంచి బయటకు రాగానే యాసిడ్‌తో దాడి చేసింది. దీంతో మహేష్‌కు వీపు, ఎడమ కన్నుపై భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. మహేష్ ఫిర్యాదు మేరకు లక్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

రాష్ట్రంలో రాక్షస పాలన పోయి ప్రజాపాలన

చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్‌వెంకటస్వామి

మల్యాల, మార్చి 19: రాష్ట్రంలో పదేళ్ల రాక్షస పాలన పోయి ప్రజాపాలన సాగుతోందని చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర ప్రజలు రాక్షస పాలనకు చరమగీతం పాడడంతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన వచ్చిందని తెలిపారు. మంగళవారం కొండగట్టు అంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన తన గెలుపు కోసం అభిమాని అంజనేయస్వామికి 105 కొబ్బరికాయల మొక్కు పెట్టుకోగా అభిమానితో కలిసి వివేక్ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం జైజంక్షన్ వద్ద ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్ ఇనుప కంచెలు బద్దలు కొట్టారని ప్రజాపాలనపై ప్రజలకు భరోసా కల్పించారన్నారు. మిషన్ భగీరథ పథకం విఫలమైన దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం తగు చర్యలను తీసుకుంటుందని తెలిపారు.

పూడూర్‌లో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

కొడిమ్యాల, మార్చి 19 : మండలంలోని పూడూర్ గ్రామంలో ఎల్లమ్మ బోనాల పండగ మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామంలోని గౌడ కులస్తులు, సుమారు 200 మంది మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించుకున్నారు. పుట్ట బంగారం తీసుకవచ్చి ఎల్లమ్మ పట్నం వేశారు. అనంతరం పూజారులు ఎల్లమ్మ జమదగ్నికి కల్యాణం నిర్వహించారు. ఒగ్గుకథ కళాకారుల ఎల్లమ్మ కథను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం నాయకులు గడ్డమీది శ్రీనివాస్‌గౌడ్, నూతన సంఘం జిల్లా అధ్యక్షుడు వొల్లా జలెందర్‌గౌడ్, కుమార్‌గౌడ్, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ వొల్లాల లింగాగౌడ్, వెంకటేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

తెలంగాణ భూ భాగం ఆంధ్రకు ధారాదత్తం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, మార్చి 19: రాష్ట్రంలోని ఏడు మండలాలను అంధ్రప్రదేశ్‌కు ధారదత్తం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ అధినేత్ర సోనియా గాంధీ యూపీఏ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్టం ఏర్పాటుకు కృషి చేసిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఖమ్మం జిల్లాలో ఉన్న ఏడు మండలాలను గుట్టు చప్పుడు కాకుండా నరేంద్ర మోదీ ప్రభుత్వం అంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ధారాదత్తం చేసిందన్నారు. 2014లో అధికారంలో వచ్చినటువంటి బీజేపీ ప్రభుత్వం ఈ రోజు వరకు తెలంగాణ ప్రాంతానకి ఎమి చేసిందో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పష్టం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంతం రాజం, తిరుమల గంగాధర్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, మార్చి 19 : వాటర్ ప్లాంట్ల యజమానులు వారి ప్లాంట్ల వద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ తిరుపతి యజమానులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ప్లాంట్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్లాంట్ యజమానులు నాణ్యతతో నీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు సరఫరా చేయాలన్నారు. వాటర్ ప్లాంట్‌లో పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటర్ ప్లాంట్ యజమానులు ఐఎస్ఐ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, వాటర్ ప్లాంట్ యజమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్‌పై అవగాహన



పార్లమెంట్ సమావేశం నిర్వహిస్తున్న విద్యార్థులు

కోరుట్ల, మార్చి 19 : పట్టణంలోని లిటిల్ జీనియస్ పాఠశాలలో మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్, పార్లమెంట్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓటింగ్‌తో పాటు పార్లమెంట్ సమావేశాలను నిర్వహించారు. సమావేశంలో వివిధ బిల్లులు ప్రవేశ పెట్టి నిధులు మంజూరు చేసి ప్రజలకు చేరవేసే విధానాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి వారి తల్లి దండ్రులకు ఓటు హక్కు గురించి వివరించి మంచి పాలకులను ఎన్ను కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ రాధాకృష్ణ, వినోద్, డైరెక్టర్లు కొత్త రాజు,కటుకం శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం..

మహిళ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నీలి గాయత్రి

కోరుట్ల, మార్చి 19: నారీ శక్తి ఐక్యమై కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీకి బుద్ధి చెబుదామని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నీలి గాయత్రి అన్నారు. మంగళవారం పట్టణంలోని విలేకర్ల సమావేశంలో పట్టణ మహిళ మోర్చా సభ్యులతో కలిసి మాట్లాడారు.రాహుల్‌గాంధీ మహిళా శక్తి గొప్పతనం తెలియకుండా ఎగతాళిగా మాట్లాడడం విడ్డూరమన్నారు. మహిళలు మహిళ శక్తిని చాటి ప్రధానిగా మరోమారు నరేంద్ర మోదీని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా కార్యదర్శి పూర్ణిమ చౌదరి, మోర్చా సభ్యులు ప్రియాంక, మమత, లత పాల్గొన్నారు.

ఘనంగా గజ లక్ష్మీదేవి ఆరాధన మహోత్సవం

మెట్‌పల్లి, మార్చి, 19: పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో శ్రీ గజ లక్ష్మీదేవి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, కాత్యాయనీ దేవి, శ్రీవల్లిదేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు, కుంకుమ, లక్ష్మీదేవి పూజలు కార్యక్రమాలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ నిర్వహించారు. గోశాల వద్ద గాజుల పూజ నిర్వహించి మహిళలకు పసుపు కొమ్ము, గాజులు, పండ్లను అందజేశారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవ పూజలు

మల్లాపూర్, మార్చి, 19 : మండలంలోని రాఘవపేట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా కొనసాగాయి. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు వైభవంగా జరిపారు. అనంతరం స్వామి వారి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సరోజన దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమదిబేగం



చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి

మెట్‌పల్లి రూరల్, మార్చి, 19: మహిళలు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్యలు తొలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమదిబేగం సూచించారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కోనరావుపేట, ఆత్మకూర్ గ్రామం అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారులు, మహిళలతో ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పిం చారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారంపై మహిళలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. 5 ఏళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చే ర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, రమ, స్వప్న, లక్ష్మి, ప్రమీల, రాజేశ్వరి, వందన, పద్మ, నాగమణి, ఆయాలు పాల్గొన్నారు

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



రాజారం గ్రామంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 19: ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అమ్మవారి దయతో, ప్రజల దీవెనతో ఎమ్మెల్యేగా విజయం సాధించానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని రాజారం గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మ వారిని దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించాలని మొక్కుకుని ముడుపు కట్టినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయడంలో ఎలాంటి విఘ్నాలు రాకుండా చూడాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అంతకు ముందు ఆలయం పక్షాన ఆయనకు స్వాగతం పలికి శాలువా కప్పి స్వాగతం పలికారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనబట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు జక్కు రవీందర్, ఎంపీటీసీ తోడేటి గంగాధర్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ బుర్ర భీమయ్య గౌడ్, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షు లు రాందేని మొగిలి, అప్పం తిరుపతి, ఆశెట్టి శ్రీనివాస్, సుముఖ్, రంగు అశోక్ పాల్గొన్నారు.

●ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఆయనకు స్వామి శేష వస్త్రం కప్పి సన్మానించారు.

● ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను తన నివాసంలో మంగళవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేకానంద మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ దంపతులు ఆయనను శాలువా కప్పి సన్మానించారు.

దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమితులైన జక్కు రవీందర్‌ను మంగళవారం జగిత్యాల ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో రవీందర్‌ను వారందరు ప్రత్యేకంగా అభినందించారు. రవీందర్ నియామకం కోసం సహకరించిన విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వారందరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కమటాల రవీందర్, రాష్ట్ర నాయకులు తొగిటి గంగాధర్, ఎంఎల్ రెడ్డి, కస్తూరి సుధాకర్, టీపీ రెడ్డి, కిష్టయ్య, బీఎల్ నర్సయ్య, మోహన్, రాజేశం, రజబ్‌అలీ, శంకర్ పాల్గొన్నారు.



ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు

నిరుపేద వెలమ సంక్షేమానికి కృషి చేస్తా..

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, మార్చి, 19 : రాష్ట్రంలోని వెలమ సామాజిక వర్గంలోని నిరుపేద వారి అభివృద్ధి కోసం కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ సంజయ్‌ను జిల్లా వెలమ సంక్షేమ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వెలమ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదల అభివృద్ధి కోసం ప్రత్యేక వెలమ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక సామాజిక వర్గాల కోసం కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయడం జరుగుతున్నందున రాష్ట్రంలో వెలమ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా నిరుపేద వెలమ సామాజిక వర్గం అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాచమనేని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి దన్నపునేని వేణుగోపాల్‌రావు, కోశాధికారి దామోదర్‌రావు, కార్యవర్గ సభ్యులు శ్రావణ్‌రావు, కోటేశ్వరరావు, గోపిడి సురేందర్‌రావు, కిరణ్‌రావు, బేజ్జంకి అజిత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో డాక్టర్ సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న వెలమ సంక్షేమ సంఘం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికార యంత్రాంగంతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు జరిగే రోజులలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారని, భక్తులు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రముఖులు, ముఖ్యులు దర్శనానికి వచ్చే సమయాల్లో ప్రోటోకాల్ పాటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి విధులు నిర్వహించాలన్నారు. ప్రధాన దేవాలయం, శివాలయంలోకి వెళ్లే భక్తులకు క్యూలైన్ నిర్వహణకు అవసరమైన పోలీస్, వలంటీర్లను నియమించడం జరుగుతుందన్నారు. వాహనాల పార్కింగ్‌నకు బ్రాహ్మణ సంఘం, హరిత హోటల్ ప్రక్కన గల ప్రాంతాలలో చేయాల్సి ఉంటుందన్నారు. ఎమర్జన్సీ పార్కింగ్‌ను జూనియర్ కళాశాల, నక్కల పేటలలో ఏర్పాట్లు చేయాలన్నారు. దేవాలయం, మంగళ్‌గడ్డ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, నిమ్ కాలేజీ, బస్టాండ్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులను నిరంతరంగా ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన కొన్ని ప్రాంతాలల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని, తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, అగ్ని మాపక శాఖ, మున్సిపల్ తదితర శాఖలకు చెందిన ఉద్యోగులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీఓ మధు సుదన్, డీఎస్పీ రఘు చందర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని బండలింగపూర్ గండి హన్‌మాన్ ఆలయం వద్ద జాతీయ రహదారిపై అంతర్ జిల్లా చెక్‌పోస్టను మంగళవారం ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వాహనాలను తనిఖీ చేశారు.ఆయన మాట్లాడుతూ ఎలాంటి అధారలు లేకుండ 50 వేలకు మించి డబ్బులు తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రాములు, సిబ్బంది చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

సారంగాపూర్, మార్చి, 19 : దుబ్బరాజేశ్వర స్వామి ఆలయంలో అనుబంధ ఆలయమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అలువేలుమంగ, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణం అంగరంగా వైభవంగా కన్నుల పండువగా జరిపించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష ఆలయ చైర్మన్ శంకరయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

రాయికల్, మార్చి 19: మండలంలోని కిష్టంపేట గ్రామంలో అక్రమ మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన చౌట్‌పెల్లి కిరణ్ అనే వ్యక్తి బెల్టు షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యాన్ని అమ్ముతుండగా పోలీసులు దాడులు చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.44 వేల విలువ గల 79 లీటర్ల మద్యాన్ని జప్తు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

మంచి నీటి పథకం పునఃప్రారంభానికి నిధులు మంజూరు

బీర్‌పూర్, మార్చి 19: మండల కేంద్రంలోని సమగ్ర రక్షిత మంచి నీటి పథకం పునః ప్రారంభం కోసం రూ.3.70కోట్లు మంజూరు అయినట్లు మంగళవారం బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేష్ తెలిపారు. నియోజకవర్గంలోని బీర్‌పూర్ మండలంలో గల గ్రామాలకు గతంలో ఇంటింటికి శుద్ధమైన తాగు నీరు అందించిన సమగ్ర రక్షిత మంచి నీటి పథకాన్ని పునరుద్ధరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. తాగు నీటి సమస్య పరిష్కరిస్తామని గత ఎన్నికల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండల ప్రజలకు హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోనికి వచ్చిందని ఇచ్చిన హామీని నెర వేర్చాలనే ఉద్దేశంతో బీర్‌పూర్ సమగ్ర రక్షిత మంచినీటి పథకం పునఃప్రారంభం కోసం నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి రక్షిత మంచి నీటి పథకం మరమ్మతుల కోసం 3.70కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండల ప్రజల తరుపున ఎంపీపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, మాజీ సర్పంచ్ శ్రీమతి జితేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెరుపూరి సుభాష్ యాదవ్, కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట

సారంగాపూర్, మార్చి, 19 :పేద ప్రజల అభివృద్ధి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సారంగాపూర్ మం డల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రంగపేట గ్రామానికి ఎందిన రామడుగు పుష్పలతను నిమమిస్తూ నియామక పత్రం అందజేశారు. అనంతరం మండల సీనియర్ నాయకులు కాలగిరి బాపురెడ్డి, కోనాపూర్ సహకార సంఘం వైస్ చైర్మన్‌గంగాధరి మంగమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి జీవన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే కుల వృత్తులకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కుల వృత్తులకు ప్రోత్సాహం లభించిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యేను ఇటీవల ఎన్నికయిన పలువురు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సెలూన్లకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ కేసీఆర్ సర్కారు అండగా నిలబడిందన్నారు. చేతి వృత్తులకు బీసీ బందు పథకం కింద రూ. లక్ష ఆర్థిక సాయం అందించామని గుర్తు చేశారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. నాయీ బ్రాహ్మణ ఆత్మ గౌరవ భవన నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లాలో సుమారు రెండెకరాల స్థలాన్ని గత సర్కారు కేటాయించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

● జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో గల శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. పలువురు చల్‌గల్ గ్రామ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి, హనుమాజిపేట గ్రామాల గౌడ సంఘ పలువురు సభ్యులు మంగళవారం జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి రేణుక ఎల్లమ్మ పట్నాలు, బోనాల పండుగ రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 27వ తేదీన ఆలయంలో జరిగే ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. నాయకులు శేఖర్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ బోనాల పండుగ ఆహ్వానపత్రం ఎమ్మెల్యేకు అందిస్తున్న హనుమాజిపేట వాసులు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

జగిత్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ యువకుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన ఎం అజయ్(23) గొల్లపల్లికి వెళుతుండగా జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా డ్రంకెన్ డ్రైవ్‌లో పరిమితికి మించి మందు తాగినట్లు తేలింది. అంతే కాకుండా సదరు వ్యక్తి పోలీస్ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించడంతో యువకుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ జి కరుణాకర్ అజయ్‌కి రెండు రోజుల పోలీస్ కస్టడీకి ఆదేశాలు జారీ చేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, మార్చి 19: క్రీడలలో గెలుపోటములు సహజమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్‌లో అయిలపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ - 1 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ గెలుపోటములు సమానంగా తీసుకొని క్రీడలల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిడుగు సందయ్య, మహిపాల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

కోరుట్ల రూరల్, మార్చి 19: పట్టణంలోని జువ్వాడి భవనంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు అల్లాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి నర్సింగరావును సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు కొటగిరి ప్రసాద్, రేకొండ సత్యనారాయణ, పడిగెల శ్రీనివాస్, లింగ ఉదయ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు నేతి శ్రీకాంత్, చిటిమెల్ల రంజిత్, మంచాల మహేష్, శ్రీపతి పరమేశ్వర్ పాల్గొన్నారు.

వరద కాలువ నీటి విడుదలపై హర్షం

కథలాపూర్, మార్చి 19: వరద కాలువకు నీటి విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వరద కాలువకు నీరు రావడంతో వేలాది ఎకరాల పంటలకు రక్షణ ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పూండ్ర నారాయణరెడ్డి, న్యావనంది శేఖర్, నారాయణ, అనంతరెడ్డి, సత్యనారాయణ, శంకర్, గంగారెడ్డి, సాయిరెడ్డి, లింగారావు ఉన్నారు.

దహన సంస్కారాలకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చేయూత

మల్లాపూర్, మార్చి, 19: మండలంలోని మొగిలిపేటలోని నిరుపేద కుటుంబానికి చెందిన బొక్కనపల్లి లక్ష్మీనారాయణ సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మీనారాయణ కుటుంబానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దహన సంస్కారాలకు కావాల్సిన ఏర్పాట్లు చేసి కుటుంబానికి అండగా నిలిచారు. ట్రస్ట్ సభ్యులను బంధువులు, గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్, మనదీప్, రాంప్రసాద్, మనోజ్, చెట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, మార్చి 19: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను మల్యాల శివారులో పోలీసులు పట్టుకున్నారు. బొలేరో వాహనంలో తరలిస్తున్న 34.50 క్వింటాళ్ల బియ్యంను పట్టుకొని బియ్యం తరలిస్తున్న బండారి ఎల్లయ్య, నక్క వెంకట్‌లపై సుమోటో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

రేణుక ఎల్లమ్మ బోనాలు

ఎండపల్లి, మార్చి19: మండలంలోని ఎండపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు కులస్తులందరు ఇంటింటా బోనం వండుకుని దేవస్థానానికి చేరుకున్నారు. నేడు రేణుక ఎల్లమ్మ పట్నం కార్యక్రమం నిర్వహించనున్నట్టు కార్యవర్గం తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తోడేటి రాజయ్య గౌడ్, ఉపాధ్యక్షులు సత్తయ్య గౌడ్ పాల్గొన్నారు.

మండల గౌడ సంఘం ఎన్నిక

రాయికల్, మార్చి 19: రాయికల్ మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా ఉత్కం సాయగౌడ్ మంగళవారం ఎన్నికయ్యారు. రాయికల్ మండల కేంద్రంలో నూతన మండల గౌడ సంఘ కార్యవర్గాన్ని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్ర శేఖర్ గౌడ్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా జోగినిపెల్లి తిరుపతి గౌడ్, కోశాధికారిగా బొంగోని భూమాగౌడ్, ఉపాధ్యక్షులుగా కొత్తకొండ లింగం గౌడ్, నాగుల మల్లయ్య గౌడ్, ముఖ్య సలహాదారులుగా కైరి ముత్త గౌడ్, అనుపురం శ్రీనివాస్ గౌడ్, బత్తిని రాజేశం, పాలకుర్తి రవి, దిండిగాల రామస్వామి గౌడ్, బత్తిని వెంకటేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా జోగినిపెల్లి సురేందర్, గుర్రాల రాజేం, గడ్డం రాజేశం గౌడ్, పాలకుర్తి వెంకటేష్ గౌడ్, బొంగు రాజు గౌడ్, గరపెల్లి శ్రీనివాస్ గౌడ్, తిరుమల రవి గౌడ్, గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్‌లను ఎన్నుకున్నారు. వీరిని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, జిల్లా మెంబర్ అల్లకొండ సాయ గౌడ్‌లు అభినందించారు.